క్లుప్తంగా

ఉచిత తరగతులు ప్రారంభం

బోట్‌క్లబ్: పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించే విధంగా చేయూత భవన్‌లో నిర్వహిస్తున్న ఉచిత తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ఉచిత తరగతులకు విశేష స్పందన లభించిందని చేయూత సంస్థ కార్యదర్శి అలీమ్ తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు రవిశంకర్, బాషా, అలీమ్, రవికుమార్ తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కూడా సంస్థ సభ్యులు కావడంతో.. విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఉచిత తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'మార్ని'కి ఎన్టీఆర్ కీర్తి పురస్కారం


ఎన్టీఆర్ కీర్తి పురస్కారం అందుకుంటున్న జానకిరామ చౌదరి

బోట్‌క్లబ్: సాహిత్య, సాంస్కృతిక రంగాలకు విశేష సేవ చేస్తున్న కాకినాడకు చెందిన ప్రముఖ సాహితీవేత్త మార్ని జానకిరామ చౌదరికి ఎన్టీఆర్ కీర్తి పురస్కారం లభించింది. పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో శనివారం నందమూరి తారక రామారావు సినీ వజ్రోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మాతృభాష, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా సాంస్కృతిక సేవాతత్పరులను పురస్కారాలు అందజేశారు. కాకినాడకు చెందిన మార్ని జానకిరామ చౌదరికి శాసన సభ ఎథిక్స్ కమిటీ చైర్మన్ మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా పురస్కారాన్ని అందించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలి


ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలను వివరిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ

కరప: పర్యావరణానికి ముప్పును కలిగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించి, స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు కోరారు. సిరిపురంలో శనివారం ఆయన పంచాయతీ, సచివాలయ సిబ్బందికి, ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త విడిగా సేకరించాలన్నారు. వీధుల్లో చెత్తాచెదారం వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తడి చెత్త నుంచి కంపోస్ట్ ఎరువును తయారుచేస్తారని, దీనివల్ల పంచాయతీలకు ఆదాయం చేకూరుతుందని వివరించారు. శుభకార్యాలు, ఇతర వేడుకల్లో ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు వినియోగించవద్దని కోరారు. పంచాయతీ కార్యదర్శి పి.వీరభద్రరావు పాల్గొన్నారు.

గ్రీన్ క్యాంపస్‌గా పీఆర్ కళాశాల


చేతిపంపును ప్రారంభిస్తున్న తలాటం హరీష్

బోట్‌క్లబ్: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గ్రీన్ క్యాంపస్‌గా తీర్చిదిద్దేందుకు పీఆర్ కళాశాల గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం అన్నారు. సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన చేతిపంపును శనివారం ఆయన ప్రారంభించారు. రానున్న వర్షాకాలంలో కళాశాలలో మొక్కలు నాటాలని కోరారు. తలాటం హరీష్ మాట్లాడుతూ కళాశాలలో ఫౌండేషన్ ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. రానున్న కాలంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

200 రోజుల పని దినాలు కల్పించాలి

కొత్తపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజాబాబు డిమాండ్ చేశారు. మే డే వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఊరచెరువు సెంటర్‌లో ఏపీఆర్‌సీఎస్ జెండాను ఎగురవేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజాబాబు మాట్లాడుతూ చికాగో నగరంలో అమరవీరుల రక్తంలో తడిచిన ఎర్రజెండా కార్మికుల పతాకంగా మారి పేదలకు, శ్రమజీవలకు అండగా నిలుస్తోందన్నారు.

సెలవుల వేడుక.. సృజనకు వేదిక

- బాలభవన్‌లో చిన్నారులకు ప్రత్యేక శిక్షణ
- వేసవి సెలవుల్లో శిబిరాలు
- వివిధ రంగాల్లో ప్రతిభ చూపేందుకు విద్యార్థుల ఆసక్తి


బాలభవన్‌లో కరాటే శిక్షణ పొందుతున్న చిన్నారులు


మృదంగంలో శిక్షణ పొందుతూ..


వయోలిన్‌పై శిక్షణ

బోట్‌క్లబ్: పది రోజుల క్రితం వరకూ తెల్లవారింది మొదలు.. రాత్రి పడుకునే వరకూ పుస్తకాలతో కుస్తీ పట్టి, బ్యాగులు మోయలేక నడుమంతా సుస్తీతో ఇబ్బందులు పడిన చిన్నారులకు వేసవి సెలవులు ఆనందాన్ని తెచ్చాయి. ఈ వేసవి సెలవులకు పల్లెటూళ్లలో అమ్మమ్మ, నాన్నమ్మల ఇళ్లకు వెళ్లేందుకు కొందరు సిద్ధమైతే, మరికొందరు చిన్నారులు వారి తల్లిదండ్రులు తమ 'కళల' కలను నిజం చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. కూచేలో ప్రతిభ చూపాలని కొందరు ఉత్సాహం చూపుతుంటే, మరి కొందరు వయోలిన్ సంగీతంతో అందరి మనస్సులు రంజింపజేసేందుకు ముందుకు వస్తున్నారు. తమ చేతి వేళ్లతో మృదంగంపై కమ్మనైన సంగీతాన్ని పలికించేందుకు అనేక మంది ఇలా తమకు నచ్చిన అంశంలో శిక్షణ పొందే అవకాశాలను వినియోగించుకుంటున్నారు. ఇందుకోసం కాకినాడలోని బాల భవన్‌లో శిక్షణ పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఉచితంగా నేర్చుకునే అవకాశం

కాకినాడలోని గాంధీనగర్ చిల్డ్రన్స్ పార్కు ఆవరణలోని బాలభవన్‌లో ఏటా వేసవి ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణా తరగతులను గత నెల 24 నుంచి జూన్ 13వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఈ శిక్షణా తరగతులు ప్రతిరోజూ ఉదయం 7.30 నుంచి 10.30 వరకే, సాయంత్రం 4.30 నుంచి 7.30 వరకు జరుగుతున్నాయి. ప్రతి ఆదివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నారు. వేసవి శిక్షణా శిబిరంలో చేరేందుకు ఆరు నుంచి 16 ఏళ్లలోపు బాలబాలికలు అర్హులు. వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా గాత్రం, వయోలిన్, మృదంగం, కరాటే తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు వారికి నచ్చిన అంశంలో నైపుణ్యం కలిగిన శిక్షకులతో శిక్షణ పొందవచ్చు. శిక్షణ పొందే సమయంలో చిన్నారులు నెలవారీగా ఫీజులు చెల్లించనవసరం లేదు. చిన్నారులకు చిత్రలేఖనం, సంగీతం, వాయిద్య సంగీతం, కరాటే తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా వారిలో ప్రతిభ వెలికితీయాలనేది లక్ష్యం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏటా ఆ దిశగా బాలభవన్ తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది.

ఇక్కడ శిక్షణతో ఎంతో మేలు

చిన్నారుల అభిరుచికి తగిన విధంగా ఉండే వాయిద్యాలతోనే వారికి ప్రతిరోజూ శిక్షణ ఇస్తుంటారు. దీంతో వారిలో తోటి పిల్లలతో కలిసి గాత్ర సంగీతం, వాయిద్య సంగీతంతో పాటు, కరాటేనూ సులభంగా నేర్చుకునే అవకాశం ఉంది. అంతేకాదు, తోటి విద్యార్థులతో కలిసి మెలిసి సఖ్యంగా ఉండటం తెలుస్తుంది. పైగా కరాటే, సంగీతం, వాయిద్య సంగీతంలో శిక్షణ పొందడం వలన శారీరక, మేథో వికాసం కలుగుతుంది. తద్వారా చిన్నారులు చదువులో చురుగ్గా ఉంటున్నారని తల్లిదండ్రులు, మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.

కరాటే నేర్చుకుంటున్నాను



కరాటే అంటే ఇష్టం కావడంతో నేర్చుకుంటున్నాను. మిగిలిన సమయాల్లో స్కూల్ వెళ్లేందుకే సమయం సరిపోయేది కాదు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తొలిసారిగా వేసవి శిక్షణా శిబిరంలో బాలభవన్‌లో చేరాను. కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించాలని అనుకుంటున్నాను.

– టి.సాయిధరమ్‌తేజ, ఏడో తరగతి

గాత్ర సంగీతమంటే ఇష్టం



నేను బాలభవన్‌లో వేసవి శిక్షణా శిబిరంలో గాత్ర సంగీతం నేర్చుకునేందుకు తొలిసారిగా ఇక్కడ చేరాను. నాకు గాత్ర సంగీతం అంటే ఇష్టమైనప్పటికీ, పాఠశాలకు వెళ్లడంతో సమయం చాలక నేర్చుకోలేదు. వేసవి సెలవులు కావడంతో ఇక్కడ ఉచితంగా నేర్పించడంతో ఉదయం సాయంత్రం వేళ బాలభవన్‌లో గాత్ర సంగీతం నేర్చుకుంటున్నాను. చదువుతో పాటు, సంగీతంలోనూ ప్రావీణ్యం సాధించాలనుకుంటున్నా.

– కె.రిషిత, నాలుగో తరగతి

ఇష్టమైన రంగాల్లో శిక్షణ



బాలభవన్ విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం. వారికి ఏ రంగం ఇష్టమో ఆయా రంగాల్లో వారికి శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటికే చాలా మంది విద్యార్థులు ఈ శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఎంత మంది విద్యార్థులు వచ్చినా ఇక్కడ శిక్షణ ఇచ్చేందుకు మా సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.

– ఎ.శారద, పర్యవేక్షకురాలు, బాలభవన్

ఘనంగా సీతారామస్వామి కల్యాణోత్సవం


ప్రత్యేకాలంకరణలో సీతారామస్వామి

బోట్‌క్లబ్: నగరంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామస్వామి ఆలయంలో స్వామి జన్మ నక్షత్రమైన పునర్వసు సందర్భంగా శనివారం ఘనంగా కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. జీలకర్ర–బెల్లం, తలంబ్రాలు, మాంగల్యధారణ మహోత్సవం వంటి ఘట్టాలు కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

కొత్తపల్లి: ప్రస్తుత వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జి.రమణ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ కుళాయి కలెక్షన్లు ఇచ్చినట్టు తెలిపారు. పలువురు కుళాయిలకు మోటార్లను బిగించడం వలన శివారు ప్రాంతాలకు తాగునీరు అందడం లేదన్నారు. ముఖ్యంగా కుళాయిల ట్యాప్‌లను తొలగించరాదన్నారు. దీనిపై పంచాయితీ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ట్యాంకులను నిర్మిస్తున్నట్టు తెలిపారు.

పీఎండీఎస్ విత్తనాలతో నేల సారవంతం



విజయరాయుడుపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

కరప: రబీ కోతలకు ముందు పీఎండీఎస్(ప్రీ మాన్‌సూన్ డ్రై సోవింగ్) విత్తనాలు చల్లడం వల్ల నేల సారవంతమవుతుందని కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు అన్నారు. విజయరాయుడుపాలెం పంచాయతీ కార్యాలయంలో శనివారం ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. 31 రకాల పీఎండీఎస్ విత్తనాలను వివరించారు. ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా, సహజసిద్ధమైన కంపోస్టు ఎరువు, కషాయాలతో ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల కలుషితం కాని, ఆరోగ్యవంతమైన పంట ఉత్పత్తులు సాధించవచ్చని ఏడీఏ తెలిపారు. ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్(ఎంటీ) ఎస్.ధనలక్ష్మి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఆదర్శ రైతులు మద్దా వీర్రాజు, నందికోళ్ల సత్యారావు, తీపర్తి సత్యనాయుడును సర్పంచ్ వెలుగుబంటి సీతారామరాఘవ, ఏడీఏ బాబూరావు సత్కరించారు. అనంతరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

6 నుంచి భావనారాయణ స్వామి కల్యాణోత్సవాలు

- 8న కల్యాణోత్సవం
- 14న తెప్పోత్సవం


రాజ్యలక్ష్మి అమ్మవారు, భావనారాయణ స్వామివారి కల్యాణోత్సవం (ఫైల్)

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలో వేంచేసి ఉన్న రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 6 నుంచి ప్రారంభమవుతున్నట్టు ఆలయ కార్య నిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. కల్యాణోత్సవ వివరాలను శనివారం ఆయన మీడియాకు వివరించారు. 8న రాత్రి స్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని, 14న తెప్పోత్సవం జరుగుతుందన్నారు.

కల్యాణోత్సవ వివరాలు ఇలా..

- మంగళవారం ఉదయం 6 గంటలకు మూల మూర్తులకు పంచామృతాభిషేకం, పెళ్లి కుమారుడు చేయడం, సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణ, రాత్రి 7 గంటలకు గరుడ పొంగలి ప్రసాద వితరణ.
- 7న ఉదయం నిత్య విశేష పూజ, నిత్య హోమం, బలిహరణ, సాయంత్రం తిరు వీధి ఉత్సవం.
- 8న ఉదయం నిత్య పూజ, నిత్య హోమం, బలిహరణ, ఏకాదశి తులసి పూజ, సాయంత్రం 6 గంటలకు తిరువీధి ఉత్సవం, రాత్రి 8 గంటలకు ఎదురు సన్నాహం, 9 గంటలకు కల్యాణోత్సవం ప్రారంభం
- 9న ఉదయం నిత్య పూజ, నిత్య హోమం, సాయంత్రం కల్యాణ భావనారాయణ స్వామివారికి గ్రామోత్సవం, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు.
- 10న ఉదయం నిత్య పూజ, నిత్య హోమం, సాయంత్రం సదస్సు మహోత్సవం, పండిత సత్కారం కార్యక్రమం, అనంతరం తిరువీధి ఉత్సవం సాంస్కృతిక కార్యక్రమం.
- 11న ఉదయం నిత్య పూజ, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు.
- 12న ఉదయం నిత్య పూజ, హోమం మహాపూర్ణాహుతి, సముద్రం వద్ద చక్రస్నానం.
- 13న ఉదయం ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, రాత్రికి శ్రీపుష్పయాగం.
- 14న సాయంత్రం ముక్తికా సరస్సులో స్వామివారికి తెప్పోత్సవం.


భావనారాయణ స్వామివారు

ఈదురు గాలులు.. హోరున వర్షం

- సేదదీరిన నగర ప్రజలు
- రోడ్లపై నీరు చేరడంతో అవస్థలు


మెయిన్ రోడ్డులో అపోలో ఆస్పత్రి వద్ద నిలిచిన వర్షపు నీరు


వాకలపూడిలో కురుస్తున్న వర్షం

బోట్‌క్లబ్: కాకినాడ నగరంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో జోరుగా వర్షం కురిసింది. రెండు నెలలుగా విపరీతమైన వేడిగాడ్పులతో ఇబ్బంది పడ్డ నగర ప్రజలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడి, చిరుజల్లులు పడడంతో సేదదీరారు. గంటన్నర పైనే హోరున వర్షం కురవడంతో నగరంలో పలు ప్రాంతాలలో వర్షపు నీరు రోడ్లపైకి చేరింది. దీంతో సాధారణ ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. స్థానిక వైఎస్సార్ బ్రిడ్జి కింద వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. చిన్న మార్కెట్‌కు వెళ్లేందుకు ప్రజలు అవస్థలు పడాల్సి వచ్చింది. స్థానిక మెయిన్ రోడ్డులో వర్షపు నీరు రోడ్డుకు ఇరువైపులా నిల్వ ఉండిపోవడంతో షాపులకు వెళ్లేందుకు వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. చిన్నపాటి వర్షాలకు నగరంలో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోతుండడంతో ప్రజల బాధలు వర్ణనాతీతం. ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ ప్రజలకు ఈ వర్షం ఎంతగానో ఊరట ఇచ్చింది.

కరెంటు లేక అవస్థలు

ఈదురు గాలుల కారణంగా నగరంలో సుమారు రెండు గంటల పాటు కరెంటు కోత విధించడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈదురు గాలులు, హోరున వర్షం పడడంతో పలు ప్రాంతాల్లో చెట్లు కొమ్మలు విరిగిపడి విద్యుత్ స్తంభాలపై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో, ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మోటార్లు పనిచేయక నీరు అందుబాటులో లేకపోవడంతో అపార్ట్‌మెంట్ వాసులు అవస్థలు పడ్డారు. ఐదు అంతస్తుల భవనంలో కరెంటు సరఫరా లేకపోవడంతో లిఫ్ట్ పనిచేయక పడరాని పాట్లు పడ్డారు. వర్షం, ఈదురు గాలులు పూర్తిగా తగ్గిన తర్వాత విద్యుత్ సిబ్బంది కరెంటు పునరుద్ధరించారు.

రూరల్‌లో భారీ వర్షం

కాకినాడ రూరల్: ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టుగా శనివారం మధ్యాహ్నం కాకినాడ రూరల్‌లో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతంగా ఉండడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు చల్లని వాతావరణానికి సేదదీరారు. ఈ వర్షానికి రోడ్లు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

ఓబీఈపై అవగాహన సదస్సు

బాలాజీచెరువు (కాకినాడ): యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాకినాడ(యూసీఈకే)(జేఎన్‌టీయూకే)కు త్వరలో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) బృందం రానున్న దృష్ట్యా శనివారం సెనెట్ హాలులో అధ్యాపకులకు చేపట్టాల్సిన విధానాలు, అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ (ఓబీఈ)పై అవగాహన సదస్సు నిర్వహించారు. యూసీఈకే ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ, వరంగల్) సీఎస్ఈ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ టి.రమేష్ రీసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఉప కులపతి సీఎస్ఆర్‌కే ప్రసాద్, డైరెక్టర్లు, వైస్ ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌బీఏ గుర్తింపు పొందేందుకు అవలంబించాల్సిన విధివిధానాలు, గుర్తింపు ప్రక్రియ, మార్గదర్శకాలను ప్రొ.టి.రమేష్ అధ్యాపకులకు విశదీకరించారు. ఓబీఈ మార్గదర్శకాలను వివరించి, విద్యార్థులకు దీనిపై ఎలా అవగాహన కల్పించాలో తెలిపారు. పూర్వ ఎన్‌బీఏ నివేదికలో వచ్చిన ఫలితాలను, సూచనలను మెరుగుపర్చుకోవడానికి అవలంబించాల్సిన విధానాలను, సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా మెరుగైన ర్యాంకు సాధించేందుకు తీసుకోవాల్సిన నిర్దేశాలను వివరించారు. ఈ నేపథ్యంలో అధ్యాపకులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్‌బీఏ ర్యాంకింగ్ సాధించేందుకు లక్ష్యాలను ఏర్పర్చుకుని, వాటిని ఎలా సాధించాలో తెలిపారు. మెరుగైన ఎన్‌బీఏ ర్యాంకు సాధించేందుకు అధ్యాపకుల సమష్టి కృషి అవసరమన్నారు. నిర్దేశిత పాఠ్య ప్రణాళిక, బోధన, బోధనా పద్ధతులు, మూల్యాంకనం, అభ్యసన తదితర వాటి రూపకల్పనపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రపంచీకరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు అన్ని విశ్వవిద్యాలయాలు ఎన్‌బీఏ, నాక్ గుర్తింపు పొందడం చాలా అవసరమన్నారు. ఓబీఈ పద్ధతి ద్వారా విద్యార్థులు ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో తెలుసుకుని, వారికి మెరుగైన శిక్షణ తరగతులు నిర్వహించి, ఉత్తీర్ణత శాతాన్ని పెంచుకోవాలని వివరించారు. అనంతరం రీసోర్స్‌పర్సన్ టి.రమేష్‌ను ఉప కులపతి, డైరెక్టర్లు, మాజీ ఉప కులపతులు సత్కరించారు.

విశ్రాంత రైల్వే ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం


గురువులను సత్కరించిన విశ్రాంత రైల్వే ఉద్యోగుల కుమారులు

సామర్లకోట: రైల్వేలో 1970లో పని చేసిన ఉద్యోగుల కుమారుల అపూర్వ కలయిక ఏర్పాటు చేసుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. స్థానిక నీలమ్మ చెరువు గట్టుపై ఉన్న లయన్స్ క్లబ్ భవనంలో శనివారం పూర్వ రైల్వే ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్థానికులు, రైల్వే ఉద్యోగుల గురువులైన గోపాలాచారి, శ్రీరామచంద్రమూర్తి, సత్యనారాయణ విశ్రాంత ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇప్పటివరకూ విశ్రాంత ఉద్యోగుల కుమారుల ఆత్మీయ కలయిక చూడలేదని, కార్యక్రమం ఘనంగా జరగడంతో ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయులుగా ఉద్యోగ విరమణ చేసిన తరువాత ప్రతిరోజు సాయంత్రం ఒక గంట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై గడిపిన రోజులను శ్రీరామచంద్రమూర్తి గుర్తు చేసుకున్నారు. ఈ కలయికను ఏర్పాటు చేసిన రైల్వే విశ్రాంత ఉద్యోగులు సుబ్బారావు, కర్రి శ్రీను, ఆదినారాయణ, సూరి బాబులను అభినందించారు. కార్యక్రమంలో రైల్వే ఎంప్లాయిస్ సంఘ గౌరవాధ్యక్షుడు కేవీవీ రావు, ఎస్ఎస్ అనంతలక్ష్మి పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ కమిటీల ఏర్పాటుకు చర్యలు

పిఠాపురం: బాలల పరిరక్షణ కమిటీల ఏర్పాటుకు గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని పిఠాపురం ఐసీడీఎస్ సీడీపీఓ దుర్గాదేవి సూచించారు. జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ అధికారి కె.విజయ కుమారి ఆదేశాల మేరకు పిఠాపురం ఐసీడీఎస్ ఆఫీస్‌లో శనివారం నియోజకవర్గ పరిధిలోని గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం 2006 ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు అబ్బాయికి 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేస్తే దాన్ని బాలల్య వివాహంగా పరిగణించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా బాల్య వివాహం జరిగితే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, 181, 112 టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

కల్వర్టు పనుల తనిఖీ

సామర్లకోట: స్థానిక మఠం సెంటర్‌లోని కల్వర్టు పనులను శనివారం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప తనిఖీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో పూడిక తీత పనుల్లో భాగంగా సుమారు నాలుగు నెలల క్రితం కాంట్రాక్టర్ కల్వర్టును కూల్చి వేసిన విషయం విదితమే. దీంతో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఈ నేపథ్యంలో పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ యార్లగడ్డ చిన్ని పాల్గొన్నారు.

పిఠాపురంలో రేపు పీజీఆర్ఎస్

పిఠాపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం పిఠాపురం మున్సిపల్ గెస్ట్ హౌస్ వద్ద గల పాడా కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాడా పీడీ ఎ.చైత్ర వర్షిణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించిన డివిజనల్, మండల అధికారులు అందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్	హిట్ ది థర్డ్ కేస్, రెట్రో, జింఖానా, థండర్ బోల్ట్స్
దేవీ మల్టీప్లెక్స్	హిట్ ది థర్డ్ కేస్, రెట్రో, సారంగపాణి జాతకం, తుదరం, అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
లక్ష్మి	హిట్ ది థర్డ్ కేస్
సత్యగౌరి	థండర్ బోల్ట్స్
తిరుమల	రైడ్–2
సీఅండ్‌సీ	హిట్ ది థర్డ్ కేస్
సీఅండ్‌సీ–2	రెట్రో
శ్రీప్రియ	రెట్రో
పద్మప్రియ	హిట్ ది థర్డ్ కేస్